

సుంకేసుల బ్యారేజీ సమీపంలో అసంపూర్తిగా పర్యాటక శాఖ భవనం



టూరిజం.. నిర్వీర్యం..!

- సుంకేసుల, ఉరుకుందలో అసంపూర్తిగా పర్యాటక శాఖ భవనాలు
- అసాంఘిక కార్యక్రమాలకు నిలయం
- గత ఐదేళ్లలో నిధుల్లేక విలవిల
- వైసీపీ హయాంలో పర్యాటక శాఖ అస్తవ్యస్తం

కర్నూలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ నిధులన్నీ రుషికొండకు తరలించారు. జగన్ కోసం రూ. వందల కోట్లతో అందమైన ప్యాలెస్ నిర్మించారు. నిధుల లేమి.. చిత్తశుద్ధి లోపం.. పాలకుల అసమర్థత వెరసి గత వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక (టూరిజం) శాఖను నిస్తేజంగా మారింది. పర్యాటకుల విడిది కోసం నిర్మిస్తున్న వివిధ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఐదేళ్లుగా ఒక్కపైసా ఇవ్వకపోగా.. చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వలేదు. అసంపూర్తి భవనాలు మద్యపాన ప్రియులకు విడిదిగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఈ భవనాలు నిర్మించలేం.. నిర్వహణ చేయలేమంటూ ఆ శాఖ అధికారులు లీజుకు ఇచ్చేశారు. వారైనా పనులు మొదలు పెట్టారా..? అంటే అదీలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సుంకేసుల జలాశయం, ఉరుకుంద, కేతవరం వద్ద అసంపూర్తిగా ఉన్న ఏపీ టూరిజం భవనాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర విభజన తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని ఆనాటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగానే టెంపుల్ టూరిజం అభివృద్ధి కోసం ఉత్తర్వులు కూడా జారీ చేశారు. నల్లమల పర్వతశ్రేణి ఉత్తర భాగం సహజమైన వాతావరణం, పాతలగంగమ్మ (కృష్ణమ్మ) చెంత వెలసిన శ్రీశైలం మల్లన్న క్షేత్రం, మహానంది, అహోబిళం, మంత్రాలయం, యాగంటి, చౌడేశ్వరిదేవి క్షేత్రం, కొలనుభారతి, ఉరకుంద.. వంటి ఆధ్యాతిక క్షేత్రాల సహా సప్తనదుల సంగమేశ్వరం, సుంకేసుల జలాశయం, ఓర్వకల్లు రాతివనాలు, కేతవరం గుహల్లో ఆదిమానవులు చిత్రాలు లిపి, బెలంగుహలు.. ఇలా ఎన్నో ఆధ్యాత్మిక, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. పర్యాటకులను ఆకట్టుకోవడానికి విడిది వంటి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంగా భవన నిర్మాణాలకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే 2017-18 మధ్యలో దాదాపు రూ.3.40 కోట్లతో కేతవరం ఆదిమానవులు గుహలు, సుంకేసులు బ్యారేజీ, ఉరుకుందు ఈరన్న క్షేత్రంలో పర్యటకులు, భక్తుల కోసం విడిది భవనాలు, పిల్లలకు ఆట సామగ్రి ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. ఆనాటి పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అయితే భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగానే.. 2019 ఎన్నికల రావడం, ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ గెలవడం, సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఒక్కపైసా కూడా నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే అసంపూర్తిగా ఆగిపోయాయి.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

కర్నూలు నగరానికి 26 కిలోమీటర్ల దూరంలో తుంగభద్ర నదిపై సుంకేసుల బ్యారేజీ (డ్యాం) 1861లో ఆనాటి బ్రిటీష్ పాలన కాలంలో నిర్మించారు. బ్యారేజీకి 30 గేట్లు ఏర్పాటు చేశారు. తుంగభద్రకు వరద వస్తే గేట్లుఎత్తి వరదను దిగువకు విడుదల చేస్తారు. కనువిందు చేసే వరద దృశ్యాలను తిలకించేందుకు కర్నూలు నగరం సహా వివిధ ప్రాంతాల నుంచి ప్రకృతి పర్యాటకులు కుటుంబాలతో సహా వస్తున్నారు. సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి భారీగా ఉంటుంది. అయితే అక్కడ ఎలాంటి విడిది వసతి లేదు. దీంతో 2017-18లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం రూ.1.25 కోట్లతో పర్యాటకుల విడిది కోసం వివిధ సౌకర్యాలతో జలాశయం సమీపంలోనే అందమైన భవన నిర్మాణం చేపట్టింది. 50 శాతానికిపైగా పూర్తి పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. అసంపూర్తిగా ఉన్న ఆ భవనం మద్యపాన ప్రియులకు కేంద్రంగా మారింది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి భవనాన్ని పరిశీలిస్తే ఏ గదిలో చూసినా ఖాళీ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. కనీస పర్యవేక్షణ కూడా లేదు. ఓర్వకల్లు మండలం కేతవరం ఆదిమానవుల గుహలు, ఆనాటి చిత్ర లిపికి ప్రసిద్ధి. వీక్షించేందుకు రాష్ట్ర నలమూలల నుంచి చారిత్రక పర్యాటక ప్రేమికులు వస్తుంటారు. వారి కోసం రూ.90 లక్షలతో విడిది భవనంతో పాటు పిల్లలు ఆడుకోవడానికి వివిధ పరికరాలు ఏర్పాటు చేశారు. కౌతాళం మండలం ఉరుకుంద లక్ష్మీనరసింహస్వామి (ఈరన్న) క్షేత్రం ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతోంది. శ్రావణ మాసంలో లక్షలాది భక్తులు వస్తుంటారు. ఏపీ పర్యాటక శాఖ రూ.75 లక్షలతో విడిది భవనం నిర్మాణం చేపట్టింది. ఈ భవనాలు కూడా అసంపూర్తిగా ఆగిపోయాయి.



ఏ గదిలో చూసినా ఇలా మద్యం సీసాలే



లీజుకి ఇచ్చినా..

'మా శాఖకు నిధులు లేవు.. ఆ భవనాలను సంరక్షించే సిబ్బంది లేరు..' అంటూ ఏపీ టూరిజం శాఖ అధికారులు వాటిని 15-20 ఏళ్ల లీజుకు ఇచ్చారు. గత ప్రభుత్వంలో లీజు కేటాయింపుల్లో కూడా భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. సుంకేసుల బ్యారేజీ వద్ద నిర్మించిన పర్యాటక భవనం ఏడాదికి రూ.5 లక్షల చొప్పున పూర్ణచంద్రరావు లీజుకు తీసుకున్నారు. ఉరుకుంద క్షేత్రంలోని భవనం ఏడాదికి రూ.50వేలు, కేతవరం భవనం రూ.లక్ష చొప్పున మల్లికార్జున అనే వ్యక్తికి ఏపీ పర్యాటక శాఖ అధికారులు లీజుకు ఇచ్చారు. ప్రస్తుతం ఎలా ఉందో ఆ దశలోనే భవనం లీజుదారులకు అప్పగిస్తే.. ఆ భవనాన్ని వారు నిర్మాణం పూర్తి చేసి, పర్యాటక శాఖ నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పర్యాటకులకు అద్దెకు ఇవ్వాలి. అయితే సుంకేసుల వద్ద భవనం తీసుకున్న లీజుదారుడు పూర్ణచంద్రరావు ఇప్పటికీ ఒప్పందం (అగ్రిమెంట్) చేసుకోలేదు. అసంపూర్తి భవనాలు నిర్మాణాలు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లీజును రద్దు చేసి పర్యాటక శాఖ ఆధ్వర్యంలోనే భవనాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



పెంకులు ఊడిపోతున్న పర్యాటక భవనం



ఉరుకుందలో పర్యాటక శాఖ భవనం దుస్థితి



ఏ గదిలో చూసినా ఇలా మద్యం సీసాలే

నిధులు రాకపోవడంతో లీజుకు ఇచ్చాం

సుంకేసుల బ్యారేజీ, ఉరుకుంద, కేతవరం వద్ద ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల వసతి కోసం దాదాపు రూ.2.90 కోట్లతో విడిది భవనాల నిర్మాణం చేపట్టాం. నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాటిని లీజుకు ఇచ్చాం. లీజుదారులు నిర్మాణాలు పూర్తి చేసి టూరిజం శాఖ నిబంధనల మేరకు పర్యాటకులకు అద్దెకు ఇవ్వవచ్చు. ఏటేటా లీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. నిధులు, సిబ్బంది కొరత కారణంగానే లీజుకు ఇచ్చాం.

- విజయ, జిల్లా టూరిజం అధికారి, కర్నూలు

కర్నూలు డీఎంహెచ్ఓగా డాక్టర్ భాస్కర్



కర్నూలు(హాస్పిటల్), **జూలై 31:** జిల్లా టీబీ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్‌ను డీఎంహెచ్ఓ (ఎఫ్ఏసీ)గా నియమిస్తు బుధవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్ఓగా పని చేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ బుధవారం పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో డాక్టర్ భాస్కర్‌ను నియమించారు. కడప జిల్లా రాజంపేటకు చెందిన భాస్కర్ తన మొదటి ఉద్యోగ ప్రస్థానాన్ని కడప జిల్లా ఖాజీపేట పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రారంభించారు. 2022లో సివిల్ సర్జన్‌గా కర్నూలు జిల్లా టీబీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. కర్నూలు టీబీ ఆఫీసర్‌గా రెండేళ్ల అడిషినల్ డీఎంహెచ్‌వోగా పని చేసిన ఆయనకు ఇప్పుడు డీఎంహెచ్‌వోగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రధాన న్యాయాధికారిగా జి.ప్రతిభాదేవి ఇన్‌చార్జి బాధ్యతలు



కర్నూలు(లీగల్), **జూలై 31:** కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారిగా కర్నూలు నాల్గవ అదనపు జిల్లా న్యాయాధికారి జి.ప్రతిభాదేవిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా ప్రధాన న్యాయాధికారిగా ఉన్న ఎన్.శ్రీనివాసరావు బుధవారం పదవీవిరమణ చేశారు. దీంతో జి.ప్రతిభాదేవికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ సీఎంకు ఆహ్వానం

- రాఘవేంద్రస్వామి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత
- రేవంత్ రెడ్డికి పీఠాధిపతి ఘన సన్మానం



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 31: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాలు ఆగస్టు 18 నుంచి జరగనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాదులోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ కలిసి సీఎం రేవంత్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం సీఎంకు వెండి ప్లేటు, పట్టువస్త్రం, రాఘవేంద్రస్వామి మెమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు.

పాఠశాలల యాజమాన్య కమిటీకి నోటిషికేషన్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ బుధవారం తెలిపారు. ఆగస్టు 1న ఎన్నికల నోటిఫికేషన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జారీ చేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నానికి పాఠశాలల ఓటర్ల జాబితాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లి, లేదా తండ్రి, సంరక్షకులు ఓటరు జాబితాలో ఉంటారన్నారు. ఆగస్టు 5న ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని సరి చేసి నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు ఎన్నికైన సభ్యులు చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాలన్నారు. 2 గంటలకు ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించాలన్నారు. 3 గంటల నుంచి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించి మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఆరుగురు డీఎస్పీలు బదిలీ



రామాంజినాయక్ (ఆత్మకూరు)



షేక్ షర్ఫుద్దీన్ (ఏపీఎస్పీ, కర్నూలు)



శ్రీనివాసాచారి (మహిళా స్టేషన్)



శ్రీనివాసులు (డోన్)



రవికుమార్ (ఆళ్లగడ్డ)



జే.బాబు ప్రసాద్ (కర్నూలు)

కర్నూలు, జూలై 31: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నలుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీ బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో కర్నూలు డీఎస్పీగా జే. బాబు ప్రసాద్‌ను నియమించింది. ఈయన ప్రస్తుతం కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఉన్నారు. కర్నూలు డీఎస్పీగా ఉన్న విజయశేఖర్‌ను పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. అలాగే డోన్ డీఎస్పీగా శ్రీనివాసులును నియమించింది. ఈయన ప్రస్తుతం సీఐడీ విభాగంలో ఉన్నారు. డోన్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసరెడ్డిని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్ డీఎస్పీగా ఉన్న భక్తవత్సలంను పొద్దుటూరు డీఎస్పీగా బదిలీ చేసింది. ఆళ్లగడ్డ డీఎస్పీగా షేక్ షర్ఫుద్దీన్‌ను ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్ డీఎస్పీగా నియమించింది. ఆత్మకూరు డీఎస్పీగా రామాంజినాయక్‌ను నియమించింది. ఈయన ప్రస్తుతం థర్డ్ బెటాలియన్‌లో డీఎస్పీగా ఉన్నారు. ఆత్మకూరు డీఎస్పీగా ఉన్న శ్రీనివాసరావును ప్రభుత్వం నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించింది. అలాగే తిరుమల లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసాచారిని కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమించింది. నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డిని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే కడప పోలీస్ ట్రైనింగ్ సెంటరులో డీఎస్పీగా ఉన్న రవికుమార్‌ను ఆళ్లగడ్డ డీఎస్పీగా నియమించింది.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: జిల్లాలోని ప్రతి గ్రామంలో, పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో కొన్ని మండలాల్లో ఉదయం 11, 12 గంటలకు కూడా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. ఈసారి అలాంటి పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్డీఎం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న వరద ఉధృతి

శ్రీశైలం, జూలై 31: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను బుధవారం 8 క్రస్టుగేట్లును 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,01,850 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 23,502 క్యూసెక్కులు మొత్తం 3,25,352 వరద ప్రవాహం వస్తుంది. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి 3,62,411 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.60 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 24,917 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 2,23,128 క్యూసెక్కులు మొత్తం 2,83,360 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వైభవంగా లింగ మహా పూజ

పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్నజగత్ గురువు

ఆదోని టౌన్, జూలై 31: స్థానిక రెడ్డీస్ కల్యాణ మంటపంలో బుధవారం జగత్ గురువు, కాశీ క్షేత్ర పీఠాధిపతి 1008 డాక్టర్ మల్లికార్జున విశ్వ రాజ్య మహాస్వాముల వారు ఇష్ట లింగ మహా పూజను వైభవంగా నిర్వహించారు. ఏడాదికి ఒక సారి జరిగే ఈ మహా లింగ పూజ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వీరశైవ మహిళా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు జగత్ గురువుకు పూలతో పాద పూజ చేశారు. ఈ కార్యక్రమం వీరశైవ మహిళా సంఘం సభ్యురాలు జి.తేజస్విని, కౌన్సిలర్ కేయం నాగరత్న, పాటిల్ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగాయి.

కర్నూలు రేంజ్ పరిధిలో 35 మంది సీఐల బదిలీ

కర్నూలు, జూలై 31: కర్నూలు రేంజ్ పరిధిలో అనంతపురం, కడప, కర్నూలు తిరుపతి, నంద్యాల జిల్లాల్లో 35 మంది సీఐలు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.శ్రీరామ్	ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి	ఆదోని వన్‌టౌన్ పీఎస్, కర్నూలు
ఎస్.తేజ మూర్తి	ఆదోని వన్‌టౌన్, కర్నూలు	చిన్న చౌక్ యుపీఎస్, కడప జిల్లా
పీ.నరసింహారెడ్డి	చిన్నచౌకు యుపీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
పీవీ సూర్య మోహన్ రావు	ఏపీ జెన్కో, (ఆన్ రిజిస్ట్రేషన్)	ఆదోని టూటౌన్, కర్నూలు
డి.గోపి	ఆదోని టూటౌన్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
బి.సుదర్శన్ రెడ్డి	వీఆర్ఎస్‌పీ, నంద్యాల	ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా
బి.మధుసూదన్‌రావు	ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
ఏ.గంగాధర్	వీఆర్, కర్నూలు	గోనెగండ్ల, కర్నూలు జిల్లా
ఏ.రామకృష్ణయ్య	గోనెగండ్ల, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
కె.శ్రీనివాస్ నాయక్	సీసీఎస్, కడప	ఆలూరు పీఎస్, కర్నూలు జిల్లా
బి.వెంకటేశ్వర్లు	ఆలూరు పీఎస్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
డి.మస్తాన్ వలి	భాకరపేట్ సర్కిల్, తిరుపతి జిల్లా	ఆస్పరి పీఎస్, కర్నూలు జిల్లా
ఎస్.హనుమంతప్ప	ఆస్పరి పీఎస్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
బీఏ మంజునాథ్	ఆదోని ట్రాఫిక్, కర్నూలు	కోసిగి సర్కిల్, కర్నూలు జిల్లా
జి.ప్రసాద్	కోసిగి సర్కిల్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
పి.రామాంజులు	ఖాజీపేట పీఎస్, కడప	మంత్రాలయం సర్కిల్, కర్నూలు జిల్లా
కె.ఎరిషావలి	మంత్రాలయం సర్కిల్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
జీవీ నాగరాజరావు	సీసీఎస్, కర్నూలు	కర్నూలు టూటౌన్
జి.ఇంతియాజ్ బాషా	కర్నూలు టూటౌన్	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
సీఎం రాకేష్	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, నంద్యాల	డోన్ రూరల్, నంద్యాల జిల్లా
కె.ప్రవీణ్ కుమార్	డోన్ టౌన్, నంద్యాల జిల్లా	వీఆర్ఎస్‌పీ, నంద్యాల జిల్లా
ఎం.వెంకటరామిరెడ్డి	గుత్తి పీఎస్, అనంతపురం జిల్లా	ప్యాపిలి సర్కిల్, నంద్యాల జిల్లా
జి.సుధాకర్ రెడ్డి	ప్యాపిలి సర్కిల్, నంద్యాల జిల్లా	నందికొట్కూరు రూరల్ సర్కిల్, నంద్యాల
వై.ప్రవీణ్ కుమార్ రెడ్డి	పత్తికొండ యుపీఎస్, కర్నూలు జిల్లా	నందికొట్కూరు యుపీఎస్, నంద్యాల
జి.ప్రకాష్ కుమార్	నందికొట్కూరు యుపీఎస్, నంద్యాల	వీఆర్‌పీఎస్, నంద్యాల
డి.వెంకటేశ్వరరావు	ఎస్‌బీ-2, నంద్యాల	బేతంచెర్ల యుపీఎస్, నంద్యాల
జి.ప్రియతమ్ రెడ్డి	బేతంచెర్ల యుపీఎస్,నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
ఎం.మంజునాథరెడ్డి	సీసీఎస్, నంద్యాల	ఆత్మకూరు సర్కిల్, నంద్యాల జిల్లా
ఎం.నాగభూషణం	ఆత్మకూరు సర్కిల్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
జే.శివశంకర్	వీఆర్, కడప	మైదుకూరు, కడప
ఎం.శ్రీనాథరెడ్డి	మైదుకూరు రూరల్ సర్కిల్, కడప	వీఆర్ఎస్‌పీ కడప
పి.నరేష్ బాబు	వీఆర్, అన్నమయ్య	ఎర్రగుంట్ల యుపీఎస్, కడప
ఆర్.ఈశ్వరయ్య	ఎర్రగుంట్ల యుపీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
బి.రామకృష్ణ	ఆన్ రిజిస్ట్రేషన్, ఎస్‌హెచ్‌ఆర్‌సీ, కర్నూలు	కడప వన్‌టౌన్, కడప
సి.భాస్కర్ రెడ్డి	కడప వన్‌టౌన్, వైఎస్సార్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు జిల్లాకు చెందిన తహసీల్దార్లు జోన్-4లో వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల విధులనంతరం తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాకు చెందిన తహసీల్దార్లు డీఆర్వో కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరికి బుధవారం జిల్లాలోని వివిధ మండలాలకు పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్	కేటాయించిన స్థానం
పి. రాజేశ్వరి	కలెక్టరేట్ ఏఓ
ఐ. వేణుగోపాల్	కర్నూలు ఆర్డీఓ ఏఓ
కె. వసుంధర	ఆదోని ఆర్డీఓ ఏఓ
కె. సతీష్	పత్తికొండ ఆర్డీఓ ఏఓ
ఏ. వెంకటేశ్వర్లు	కలెక్టరేట్ ఏఓ (ఎల్ఆర్)
ఏ. వేణుగోపాల్	కలెక్టరేట్ (కేఆర్‌సీసీ)
వేణుగోపాల్	ఆర్డీఓ (కేఆర్‌సీసీ),
ఎస్. యోగేశ్వరి దేవి	కలెక్టరేట్ (న్యాయ)
ఏ. వెంకటేశ్వర్లు	కలెక్టరేట్ (కోఆర్డినేషన్)
ఏ. వేణుగోపాల్	కలెక్టరేట్ (ల్యాండ్)
టీవీ రమేష్‌బాబు	కర్నూలు రూరల్
కే. ఆంజనేయులు	కల్లూరు
డి. వెంకటేష్ నాయక్	కోడుమూరు
ఐ. విజయశ్రీ	సి. బెళగల్
కె. రామాంజనేయులు	గూడూరు
ఎస్. రామాంజనమ్మ	కర్నూలు అర్బన్
ఎస్. వెంకటరమణ	ఓర్వకల్లు
సి. చంద్రశేఖర్ వర్మ	వెల్దుర్తి
ఆర్. శివరాముడు	ఆదోని
ఎస్. శ్రీనాథ్	పెద్దకడుమూరు
కె. మల్లికార్జున స్వామి	కౌతాళం
ఎస్. రవి	మంత్రాలయం
ఏ. నిత్యానంద రాజులు	కోసిగి
ఏ. శేషఫణి	ఎమ్మిగనూరు
కె. శ్రీనివాసులు	నందవరం
కె .కుమారస్వామి	గోనెగండ్ల
బి. జయన్న	దేవనకొండ
ఎస్. నజ్మభాను	హాలహర్వి
ఆర్.గోవింద్ సింగ్	ఆలూరు
జే. శివశంకర్ నాయక్	ఆస్పరి
డి. చంద్రశేఖర్	క్రిష్ణగిరి
డి. హుశేన్ సాహేబ్	మద్దికెర
ఈ. వెంకటలక్ష్మి	పత్తికొండ
బి. నాగరాజ్	తుగ్గలి
ఎజాజ్ అహ్మద్	చిప్పగిరి

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

ఉయ్యాలవాడ, జూలై 31: మండలంలోని అల్లూరు గ్రామంలో విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ ఇల్లూరి సుంకయ్య (46) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఫ్యూజులు వేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో సుంకన్న అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానిక రైతులు హుటాహుటిన కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం కాగా, చిన్నకుమార్తె హైదరాబాదులో చదువుకుంటోంది. భార్య పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా డాక్టర్ ఎం జాన్సన్



నంద్యాల టౌన్, జూలై 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా డాక్టర్ ఎం.జాన్సన్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఏడీఆర్‌గా పని చేస్తున్న డాక్టర్ సరళమ్మ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానానికి అనంతపురం జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న జాన్సన్‌ను ఏడీఆర్‌గా నియమించారు. డాక్టర్ సరళమ్మ నుంచి ఏడీఆర్‌గా జాన్సన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు దేశ వ్యాప్త గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్తులో ఇక్కడి నుంచి పరిశోధనలు మరింత విస్తృతం చేయడమే కాకుండా వివిధ పంటల్లో కొత్త వంగడాల సృష్టికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తామని పేర్కొన్నారు.

కడప రీజనల్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు



కర్నూలు(హాస్పిటల్), జూలై 31: వైద్య ఆరోగ్యశాఖ కడప (జోన్-4) రీజనల్ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన సివిల్ సర్జన్ డా.వై. శ్రీనివాసులు నియమితులయ్యారు. కడప ఆర్డీగా పని చేస్తున్న డా.జి. రత్నకుమారి బుధవారం పదవి విరమణ పొందడంతో ఆమె స్థానంలో కడప రిమ్స్ హాస్పిటల్‌లో సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్న డా.వై. శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు గురువారం ఆయన కడప ఆర్డీ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టనున్నారు. నందవరంలో పుట్టిన డా. శ్రీనివాసులు 1 నుంచి 10 వరకు బీ. క్యాంపు ప్రభుత్వ హై స్కూల్‌లో, ఇంటర్ టౌన్ మోడల్ కాలేజీలో, 1985 బ్యాచ్ కింద ఎంబీబీఎస్ కర్నూలు కేఎంసీలో చదువుకున్నారు. దేవనకొండ పీహెచ్‌సీలో 1994లో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 2000 నుంచి 2010 వరకు కర్నూలు జీజీహెచ్‌లో సీఎంవో, బర్న్స్ వార్డులో 2012లో పాణ్యం సీహెచ్‌సీలో కర్నూలు జీజీహెచ్ డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా 2016 నుంచి 2019 వరకు పని చేశారు. అనంతరం పదోన్నతి కింద 2019లో ఒంగోలు అడిషనల్ డీఎంహెచ్‌వోగా, 2022లో బాపట్ల డీఎంహెచ్‌వోగా పని చేశారు. ప్రస్తుతం కడప రిమ్స్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్నారు.

పరిపాలనాదక్షుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్


డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 31: కర్నూలు డీఎంహెచ్‌వోగా పని చేసిన డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరిపాలనదక్షుడని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వగా పదవి విరమణ చేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను బుధవారం సాయంత్రం కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పృథ్వి వెంకటేశ్వర్లు, ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సత్యవతి, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ బాల కృష్ణ, డీపీవో ఉమాదేవి, ఏవో కె.అరుణ, డీఎంహెచ్‌వో ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి

ఆదోని, జూలై 31: ఆదోని పట్టణంలోని శుక్రవారపుపేట కాలనీకి చెందిన నాగరాజు (40) డెంగీ లక్షణాలతో బుధవారం మృతి చెందాడు. నాగరాజు 11 రోజులు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రమాదంలో గాయాలైన కాళ్లకు చికిత్సలు చేస్తుండగా డెంగీ లక్షణాలను వైద్యులు గుర్తించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకువెళాల్లని సూచించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నాగరాజు బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వీరేశమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

న్యాయవాద వృత్తి కీలకం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు


జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావును సన్మానిస్తున్న వినియోగదారుల కమిషన్ చైర్మన్

కర్నూలు(లీగల్), జూలై 31: సమాజంలో న్యాయవాద వృత్తి కీలకమైనదని, న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు సూచించారు. ఆయన పదవి విరమణ చేస్తున్న సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కర్నూలులో ప్రధాన న్యాయాధికారిగా 22 నెలల పాటు పని చేశానని, ఈ కాలంలో సహకరించిన న్యాయవాదులకు, న్యాయమూర్తులకు, న్యాయ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలె వచ్చిన మూడు క్రిమినల్ చట్టాల గురించి న్యాయవాదులు క్షుణ్ణంగా అవగాహన పెంచుకుంటే కక్షిదారులకు న్యాయాన్ని అందిస్తారని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, సీనియర్ న్యాయవాదులు వై. జయరాజు, జోగయ్యశర్మ, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, మురళి మోహన్ పాల్గొన్నారు.

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు పదవి విరమణ సందర్భంగా జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ ఆయనను ఘనంగా సన్మానించారు.

స్థాయి సంఘ ఎన్నికలకు సిద్ధం

కమిషనర్ పివి. రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: నగర పాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ తెలిపారు. బుదవారం నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమావేశానికి మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా పోలింగ్ జరిగే విధానాన్ని, ఫలితాల లెక్కింపు ప్రక్రియను వివరించారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు లేవనత్తిన సందేహాలను కమిషనర్ నివృత్తి చేశారు. ఓటు వేయడానికి కార్పొరేటర్లు పార్టీ కండువాలు, మొబైల్ ఫోన్లతో రాకూడదని, బ్యాలెట్ నమూనాలో పది మంది అభ్యర్థులలో గరిష్టంగా ఐదుగురికి ఓటు వేసే అవకాశం ఉందన్నారు. ఆపై ఎక్కువ ఓట్లు వేసినా, అభ్యర్థికి ఎదురుగా కాకుండా అటు ఇటుగా వేసిన మొత్తం బ్యాలెట్ ఓట్లు చెలనివిగా పరిగణిస్తారని ఆయన తెలిపారు. అంతే కాకుండా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మూడేళ్ల తరువాత మొట్ట మొదటిసారిగా జరగుతున్న ఎన్నికలకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

● బరిలో 10 మంది కార్పొరేటర్లు ● పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల నుంచి ఇద్దరు సభ్యులు


ఎన్నికల అవగాహనపై కార్పొరేటర్లకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: నగర పాలక సంస్థ పరిధిలోని స్టాండింగ్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నూతన కౌన్సిల్ హాలులో ఎన్నికల అవగాహనపై కార్పొరేటర్లకు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపుకు మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇప్పటికే ఎన్నికల బరిలో 10 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం పాణ్యం, కోడుమూరు నియోజకవర్గం నుండి ఇద్దరు సభ్యులను ఖరారు చేసుకున్నారు. పాణ్యం నియోజకవర్గం నుంచి 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ నామినేషన్ దాఖలు చేసారు. అయితే పాణ్యం నుంచి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40 వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డిని బలపరిచేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాణ్యం నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులు ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే స్టాండింగ్ చైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు. ఇందులో ఐదుగురు కమిటీ సభ్యులు ఉంటారు. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గం వైసీపీ-3, కర్నూలు నియోజకవర్గం టీడీపీ-4, పాణ్యం నియోజకవర్గం వైసీపీ-1, కోడుమూరు నియోజకవర్గం వైసీపీ-1 కర్నూలు నియోజకవర్గం ఇండిపెండెంట్-1 బరిలో ఉన్నారు.

కర్నూలు నియోజకవర్గంలో ఉత్కంఠ...

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 9 మంది కార్పొరేటర్లు మారారు. దీంతో ఈసారి ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని నలుగరు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వైసీపీ నుంచి ఐదుగురు నామినేషన్ వేశారు. అయితే కర్నూలు నియోజకవర్గం టీడీపీ నుంచి ఎవరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలో పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు వైసీపీ జిల్లా నాయకులు ఇటీవల జరిగిన కార్పొరేటర్ల అంతర్గత సమావేశంలో బరిలో ఉన్న ఐదుగురిని ఎన్నుకోవాలని...టీడీపీ కార్పొరేటర్లకు ఓటు వేస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. అయితే ప్రస్తుతం ఈ ఎన్నికలు సీక్రెట్ పద్ధతిలో జరుగుతుండటంతో ఎంత మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ కార్పొరేటర్లకు ఓటు వేసేదీ అర్థం కావడం లేదు. అంతే కాకుండా ఇటీవల జరిగిన మూడు స్టాండింగ్ కమిటీ సభ్యులకు నిరాశే మిగిలింది. ఎన్నికైన 8 నెలలకే సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడం...కేవలం మూడు మాత్రమే స్టాండింగ్ కమిటీ సమావేశాలే జరగడంతో నిరాశ చెందారు. అయితే నాల్గవ స్టాండింగ్ కమిటీ సభ్యులకు మాత్రమే సంవత్సరంపాటు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే ఐదో స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూడా 2026లో వచ్చే కార్పొరేషన్ ఎన్నికలతో కేవలం 8 నెలలు మాత్రమే ఉంటుంది.

అశ్విని హాస్పిటల్ ప్రారంభం


అశ్విని హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్, గౌరు చరిత

కర్నూలు(హాస్పిటల్), జూలై 31: నగరంలోని జోహరాపురం రోడ్డులో సీనియర్ ఊపిరి తిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ హంగులతో నిర్మించిన అశ్విని హాస్పిటల్‌ను బుధవారం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ హైదరాబాదు, బెంగుళూరు వంటి మహానగరాల తరహాలో కర్నూలులో అశ్విని హాస్పిటల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. గతంలో మెరుగైన సేవల కోసం ఇతర మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, ఇప్పుడు కర్నూలు మెడికల్ హబ్‌గా మారిందన్నారు. సీనియర్ పల్మనాలజిస్టుగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మొదటి నుంచి సేవాభావం కలిగిన డాక్టర్ అని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆధునిక వసతులతో హాస్పిటల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులందరూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్లు 24 గంటలు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులు త్వరగా కోలుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు నందిరెడ్డి సాయిరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

పనిసర్దుబాటు ప్రక్రియను చేపట్టాలి


డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 31: జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే చేపట్టి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని డీఈవో శామ్యూల్‌కు ఎస్టీయూ నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ నాయ కుడు ఎస్.గోకారి మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి గానూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా పెరగడం, గత మూ డు నెలల నుంచి ఉపాధ్యాయుల పదవీ విరమణ చేస్తున్నారన్నారు. అలాగే 40 ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలన్నారు. మెడికల్ బిల్లులను కాలయాపన లేకుండా మంజూరు చేయాలన్నారు. పెండింగ్ విచారణలను వెంటనే పూర్తి చేసి సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులను వెంటనే విధుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గోవిందు, దేవదాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

మంత్రి బీసీని కలిసిన ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీ


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన ఆర్‌యూ ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, టీడీపీ నాయకుడు

ఓర్వకల్లు, జూలై 31: కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ బనగానపల్లెలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి ఉన్నారు. రాయలసీమ యూని వర్సిటీలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టరేట్ ఎదుట డీఎస్‌ఎఫ్ ధర్నా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 31: ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణా ధికారి అవినీతిపై చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర నాయుడు మాట్లాడుతూ ఆర్ఐవో స్పాట్ వాల్యు యేషన్ క్యాంపులో అధ్యాపకులకు ఇతర ఖర్చులకు చెల్లించే రెమ్యూనరేషన్ విష యంలో భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. నాయకులు వీర, ఉమేష్, కృష్ణ, చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రానికి భక్తుల పాదయాత్ర

ఓర్వకల్లు, జూలై 31: ఓర్వకల్లులోని భక్తులు బుధవారం కౌతాళం మండలం సమీపంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం పాద యాత్రతో భక్తులు బయలుదేరారు. అంతకుముందు గ్రామంలోని ఆంజ నేయస్వామి, చెన్నకేశవ, చౌడేశ్వరి, సుంకులమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. గత 16 సంవత్సరాలుగా ఓర్వకల్లుకు చెందిన భక్తులు పాద యాత్రగా వెళ్లి ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుంటున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన మంగలి వెంకటేశ్వర్లు, వీర నరసింహ, మహేష్, కార్తిక్, విష్ణువర్దన్ రాజు పాదయాత్రతో బయలుదేరి వెళ్లారు.

నేడు పింఛన్ల పంపిణీ

కల్లూరు, జూలై 31: కల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పింఛన్లు ఇంటిం టికీ వెళ్లి పంపిణీ చేస్తారన్నారు. ఒకే రోజులోనే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పింఛన్‌దారులకు వారి ఇళ్ల వద్దకే అధికారులు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మల్లేశ్వరి బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ద్వారా ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సి.బెళగల్, జూలై 31: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈవోఆర్డీ సందీప్ తెలిపారు. బుధవారం మండలంలోని బురాన్ దొడ్డి, సి.బెళగల్, బ్యాథోలి, క్రిష్ణదొడ్డి గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు.

ఆర్చరీ పోటీల్లో రాణించండి


క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 31: క్రీడాకారులు ఆర్చరీ పోటీల్లో రాణించాలని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. బుధవారం అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆర్చరి టాలెంట్ హంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శంకర్‌శర్మ మాట్లాడుతూ విజయవాడకు చెందిన ధీరజ్‌ను ఆదర్శంగా తీసుకుని వచ్చే ఒలింపిక్స్‌లో జిల్లా క్రీడాకారులు ఆర్చరి విభాగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్చరి సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య, ఆర్చరి కోచ్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీటి ట్యాంకులు

» భయాందోళనలో కాలనీవాసులు

» పట్టించుకోని అధికారులు

ఓర్వకల్లు, జూలై 31: మండల కేంద్రమైన ఓర్వకల్లు, కన్నమడకల, సోమ యాజులపల్లె, కాల్వ, తదితర గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఏ క్షణంలో కూలుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆ నీటి ట్యాంకులు నిర్మించి 40 ఏళ్లు కావడంతో సిమెంటు పెచ్చులు ఊడిపోయి కడ్డీలు కనపిస్తున్నాయి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకులను కూల్చివేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ప్రమాదవశాత్తు ట్యాంకులు కూలితే ప్రాణనష్టం జరుగుతుందని అన్నారు. ఈ నీటి ట్యాంకులను తొలగించి నూతన నీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● **ఓర్వకల్లులో ట్యాంకు నిరుపయోగం :** ఓర్వకల్లులో నీటి సమస్యను పరిష్కరించేందుకు పదేళ్ల క్రితం పవర్‌గ్రిడ్ నిధులు రూ.15 లక్షలతో శ్మశాన వాటికలో తాగునీటి ట్యాంకును నిర్మించారు. అయితే.. ఆ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో రూ.15 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయి.


ఓర్వకల్లులో కూలేందుకు సిద్ధంగా ఉన్న తాగునీటి ట్యాంకు, సోమయాజులపల్లెలో శిథిలావస్థలో ట్యాంకు

కొత్త ట్యాంకు నిర్మించాలి



1991లో సోమయాజులపల్లెలో తాగునీటి ట్యాంకు నిర్మించారు. ఇది శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణంలో కూలిపోతుందోనని తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి పాతబడిన ట్యాంకును తొలగించి కొత్తది నిర్మించాలి.

- కాకి దేవేంద్ర, సోమయాజులపల్లె

బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నాం



ఓర్వకల్లులోని చాకలిగేరిలో వాటర్ ట్యాంకును నిర్మించారు. ఇది ఏ క్షణంలో కూలుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవించాం.

- లక్ష్మీదేవి, ఓర్వకల్లు

పద్య నాటకానికి చిరునామా టీజీవీ కళాక్షేత్రం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


కళాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), జూలై 31: టీజీవీ కళాక్షేత్రం పద్య నాటకానికి రాష్ట్రంలోనే చిరునామా కావాలని, ఆ దిశగా కళాక్షేత్రం కళాకారులు జాతీయ స్థాయిలో బహుమతులు సాధించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇటీవల తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ థియేటర్స్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీల్లో ఏడు జాతీయ స్థాయి బహుమతులు సాధించడం విదితమే. బుధవారం టీజీ వెంకటేశ్ కార్యాలయంలో కళాక్షేత్రం అధ్యక్షుడు, నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో కళాకారులు కలిశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ద్వితీయ బహుమతిని, అలాగే ఆరు వ్యక్తిగత బహుమతుల వివరాలు టీజీ వెంకటేశ్‌కు తెలియజేశారు.

ఏపీవీబీఎస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: ఏపీవీబీఎస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.సునీతను జిల్లా అధ్యక్షుడు అర్జున్ నియమించారు. సునీత మాట్లాడుతూ ఏపీవీబీఎస్ మహిళా అభ్యున్నతకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

స్టాఫ్ నర్సుకు సన్మానం


గీతా కుమారిని సన్మానిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 31: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసి పదవీ విర మణ పొందిన స్టాఫ్ నర్సు ఏఎస్ గీతాకుమారిని నర్సింగ్ సూపరిటెండెంట్ సావిత్రీబాయి, నర్సింగ్ ఆఫీసర్లు సన్మానించారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎనలేని సేవలు చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ హెడ్ నర్సులు పి.లీలారాణి, ఎన్.లక్ష్మీదేవి, ఎం.లీలావతి, ఎంవీ రమణమ్మ, పీజే మనోరంజని, ఈ.కళావతి, ధనలక్ష్మి, కరుణ, పద్మావతి, ఎంజే సుభాషిణి, హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రైతులు అడిగిన మందులివ్వాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

కోడుమూరు, జూలై 31: రైతులు అడిగిన పురుగుల మందులు మాత్రమే ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. స్థానిక పురుగుల మందుల దుకాణాలకు బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మందులు మాత్రమే అందించాలని అనవసరంగా పూత మందులు అందిస్తున్నారని, రైతులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. పత్తి పొలాల్లో గులాబీ రంగు, రెక్కల పురుగు కనిపిస్తే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

ప్రకాష్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: నగరంలోని ప్రకాష్‌నగర్‌లో నెలకొన్న సమ స్యలను పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రకాష్‌నగర్ రోజా దర్గా ప్రాంతంలో సీపీఐ నూతన శాఖను ఏర్పాటు చేశారు. సుమారు 50 కుటుంబాలు సీపీఐలో చేరారు. రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకాష్‌నగర్, రోజా వీధి తదితర ప్రాంతాలలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కార్పొరేటర్లు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సి.మహేష్, రేష్మబేగం, హరిత, సయ్యద్, హరిత, జ్యోతి, జయమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ సభలను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించే సామాజిక ఉద్యమాలకు జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు పీఎస్.రాధాక్రిష్ణ, ఆర్.నరసింహులు, న్యూసిటీ కార్యదర్శి ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

మా సమస్యలు తీర్చండి


మార్కెట్ యార్డు సెక్రటరీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 31: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా నాయకులు బుధవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందును కలిసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్ సెక్రటరీకి అందించిన వినతి పత్రంలో ఇప్పటిదాకా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో చేరిన వారిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే దీన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీవీ కిరణ్, నాగరాజు, మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి, అన్నయ్య పాల్గొన్నారు.

'నిరుద్యోగ యువతకు ఎగ్ కార్టులతో ప్రయోజనం'

కర్నూలు(కల్చరల్), జూలై 31: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఎగ్ కార్టులతో ఎంతో ప్రయోజనమని టీడీపీ నాయకుడు మణిబాబు అన్నారు. బుధవారం నగరంలోని 48వ వార్డులో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమ లత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఎగ్ కార్టులకు రూ. 13 కోట్లు సాయం అందించేందుకు ఎన్‌ఈసీసీ చైర్ పర్సన్ అనూరాధ జే దేశాయ్ ఆమోదం తెలిపారని అన్నారు. ఎన్టీయార్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వం జిల్లాకు వంద మంది చొప్పున ఎంపిక చేసి రూ.50 వేలు విలువైన తోపుడు బండ్లు, వంట పరికరాలు అందించనున్నదని అన్నారు.

దార్శనికుడు మహాత్మా పూలే పుస్తకావిష్కరణ

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల ఆనంద్‌బాబు రచించిన 'దార్శనికుడు మహాత్మా పూలే' పుస్తకాన్ని బుధవారం కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూలే ఆశయాలను ఆలోచనా విధానాన్ని పుస్తక రూపంలో తీసుకురావడం అవసరన్నారు. కార్యక్రమంలో బత్తుల లక్ష్మీకాంతయ్య, ధనుంజయాచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పరిశీలన

సి.బెళగల్, జూలై 31: మండలంలోని కంబందహాల్, సి. బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను హౌసింగ్ సుమంత్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, లబ్ధిదారులు ఉన్నారు.

రైతుల అభివృద్ధే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే దస్తగిరి


స్విచ్ ఆన్‌చేసి ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, అధికారులు

సి.బెళగల్, జూలై 31: రైతుల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం మండ లంలోని గుండ్రేవుల తుంగభద్ర నదిలో గంగాదేవికి ఆయన పూజలు చేశారు. అనంతరం క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆయకట్టు ఉన్న రైతులందరికీ సాగు నీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లెల్సీ అధికారులు సూర్యప్రకాశ్, సుబ్బరాయుడు, లక్ష్మన్న, టీడీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, పోలకల్లు సర్పంచ్ మాదక్క, గుం డ్రేవుల ఎంపీటీసీ నూర్జహాన్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, బీమన్న, టీడీపీ నాయకులు అమర్, జిక్రియ, మాజీ ఎంపీటీసీలు ధనుంజయుడు, బాలాజీ వెంకటేశ్, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: నగరంలోని బుధవారం ఇందిరా గాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని డీఆర్వో మధుసూదన్‌రావు తనిఖీ చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం సివిల్ సప్లయ్ సంబంధించి నిత్యావసర సరుకులు పంపిణీ, నాణ్యతపై ప్రజల నుంచి సలహాలు స్వీకరించారు. డీఎస్‌వో ప్రసాద్, ఏఎస్‌వో రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం


పదవీ విరమణ పొందిన పోలీసులకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు, జూలై 31: సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పని చేసిన సిబ్బంది పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన త్రీటౌన్ మహిళా ఏఎస్ఐ డి.సుజాత కుమారి, త్రీటౌన్ మహిళా ఏఎస్ఐ జడ్.సుశీల, కోసిగి మహిళా ఏఎస్ఐ కే.ప్రే మలీల, పత్తికొండ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కేఎన్.మోహన్‌రావులను ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ నాగరాజు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ జే.బాబుప్రసాద్, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి సీఆర్ఈ వర్క్‌షాపు

కర్నూలు(కల్చరల్), జూలై 31: కర్నూలు నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో హేమ్‌చంద్ దేవ్‌చంద్ చారిటీస్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగులకు సేవలు అందిస్తున్న అంబికా శిశు కేంద్రంలో ఆగస్టు 2, 3 తేదీల్లో రాష్ట్రస్థాయి కంటిన్యూ రిహాబిలిటేషన్ ఎడ్యుకేషన్ (సీఆర్ఈ) విధానంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని శిశుకేంద్రం డైరెక్టర్ బిందు షా అన్నారు. బుధవారం అంబికా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలకు పైగా అంబికా శిశు కేంద్రం మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు విద్యను అందిస్తోందని తెలిపారు. వర్క్‌షాపు కోఆర్డినేటర్ వీఆర్‌పీ శైలజారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్‌పీడీ యాక్టు 2016 సూచనల ప్రకారం ఏఎస్‌డీ కలిగిన వారికి కచ్చితమైన నిర్ధారణ, సర్టిఫికెట్ ఇవ్వాలని, తద్వారా రాష్ట్ర మెడికల్ బోర్డు నుంచీ లభించే మెడికల్ సర్టిఫికెట్‌తో ఏఎస్‌డీ నిర్ధారిత వ్యక్తులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలకు, సేవలకు అర్హులని వివరించారు. వర్క్‌షాప్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మోనా షా, టెక్నికల్ కోఆర్డినేటర్స్ హేమాంగి షా, నాజీమాఖాతూన్, ట్రస్టు సభ్యుడు నితిష్ షా పాల్గొన్నారు.

'ప్రభుత్వ కళావేదికను నిర్మించాలి'

కర్నూలు(కల్చరల్), జూలై 31: నగరంలో నాటక ప్రదర్శనలకు ప్రభుత్వ కళావేదికను నిర్మించాలని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం సత్యనారాయణనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మనోహర్‌బాబు అధ్యక్షతన మాసాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని పాతబస్టాండులో దశాబ్దాలుగా కళాకారు లకు అందుబాటులో ఉండే బాబూ జగ్జీవన్ రామ్ మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను గత ప్రభుత్వంలో పట్టణ సుందరీకరణ పేరుతో కూల్చి తిరిగి ప్రత్యామ్నాయంగా ఎక్కడా నగరంలో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించకపోవడం బాధాకరమని అన్నారు. టీడీపీ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కళాకారులు బీసీ సుబ్బారావు, వేట శేఖర్, జి.నారాయ ణస్వామి, మదనగోపాల్, భాస్కర్, చంద్రశేఖర్, రోశన్న పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ హెచ్చరిం చారు. బుధవారం 5, 6, 9వ శానిటేషన్ డివిజన్లు శ్రీరామ్‌నగర్, దేవనగర్, బిర్లా క్వార్టర్స్ బాపూజీనగర్, బుధవారపేట ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. కాలువల్లో పూడికలు పూర్తిగా తొలగించి, వాటి కుప్పలను మధ్యాహ్నం లోపు తీసేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్స్‌పెక్టర్లు ముర్తు జావలి, రమేష్‌బాబు, అనిల్ ఉన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యంతో నిందితులు

కర్నూలు, జూలై 31: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నూలు సనత్ నగర్ వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తనిఖీలు చేస్తుండగా.. మహేంద్ర బొలేరో వాహనంలో భారీగా కర్ణాటక మద్యం లభ్యమైంది. కర్ణాటక రాష్ట్రం రాయ చూరు నుంచి కృష్ణగిరి మండలం గోకులపాడు గ్రామానికి ఈ మద్యం తరలిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. గోకులపాడుకు చెందిన పూలజాను, బోయ ఆంజనేయుడు, బోయ అంజిలను అదుపులోకి తీసుకున్నారు. బొలేరో వాహనంలో 52 అట్టపెట్టెల్లో 4,992 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2లక్షల మేర ఉంటుందని పోలీసులు తెలి పారు. మద్యంతోపాటు బొలేరో వాహనాన్ని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రతి పంచాయతీకి ఓ కార్యదర్శి: డీపీవో

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: ప్రతి గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియమించేందుకు పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు డీపీవో నాగరాజు నాయుడు తెలిపారు. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా.. గ్రేడ్-1-4 వార్డు 224 మంది పని చేస్తున్నారు. ఇటీవల 193 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పిస్తూ ఆదేశాలు వెలువరించామని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలను పంపించామని అన్నారు.

లేబర్ బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, జూలై 31: ఉపాధి హామీ పథకంలో లేబర్ బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2024-25 సంవ త్సరంలో చేపట్టనున్న పనుల గురించి వివరించారు. మండలంలో పండ్ల తోటల పెంపకానికి 300 ఎకరాలు అంచనా వేశామని, మంజూరైన 150 ఎకరాల్లో గుంతలు తీసి పండ్ల మొక్కలు నాటాలని ఆదేశించారు. అలాగే రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో కుమార సాయినాథ్, సాంకే తిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విజేతకు అభినందన

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 31: యువ షూటర్ మనుబాకర్, సరబ్ జోత్ సింగ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్‌లో మూడో స్థానం సాధించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత జాతీయ పతాకంతో రెపరె పలాడింది. బుధవారం డీఎస్ఏ స్టేడియంలో డీఎస్‌డీవో భూపతిరావు, జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాసరరెడ్డి విజేతలకు ప్రత్యేక అభినం దనలు తెలిపారు. విజయాన్ని సూచిస్తూ సెల్ఫీతో మరిన్ని విజయాలు సాధించాలని భారత్ క్రీడాకారులకు అండగా నిలిచారు.

ఎస్పీని కలిసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జూలై 31: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, కర్నూలు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎస్పీ బిందు మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్స్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, అధ్య క్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి టి.గోపీనాథ్, యాక్టివిటీ చైర్ పర్సన్ శివయ్య, ఎన్. వెంకటరామరాజు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ పాల్గొన్నారు.

అధికారులు, స్కంద యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలి


స్కందాన్షీ లోటస్ విలాస్‌లో మురుగును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, జూలై 31: కల్లూరు అర్బన్ 37వ వార్డు ఉల్చాల రోడ్డులోని స్కందాన్షీ లోటస్ విల్లాస్‌లో మురుగు ఇళ్లను చుట్టుముట్టినా మున్సిపల్ అధికారులు, స్కందాన్షీ యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సీపీఎం నగర్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ టి.రాముడు ఆరోపించారు. బుధవారం సీపీఎం బృందం ఆధ్వర్యంలో స్కందాన్షీ లోటస్ విల్లాస్‌ను పరిశీలించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. టి.రాముడు మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు కట్టుకున్న కాలనీవాసులకు కాలనీలో ఏళ్లుగా మురుగు నిలిచిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రిషికు మార్, రమాదేవి, కస్తూరి, సుబాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

చెరువులకు నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 31: మండలంలోని పెరవలి, మదనంతపురం, బసినేపల్లి గ్రామాల్లోని చెరువులకు నీరు నింపాలని పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మదనంతపురం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరు నింపడం వల్ల ప్రజలకు, రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. చెరువులకు నీళ్లు నింపాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి కూడా తీసుకెళ్లామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బసవరాజు, గోవిందు ఉన్నారు.

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

కోసిగి, జూలై 31: విద్యారంగ అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పల్లెపాడు సర్పంచ్ రాజేంద్రనాయుడు అన్నారు. బుధవారం పల్లెపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బ్యాగులను ప్రధానోపాధ్యాయులు బాషా ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగిరెడ్డి, రామిరెడ్డి, లక్ష్మన్న, రాజు, లక్ష్మీకాంత్, రమేష్, లక్ష్మయ్య ఉన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు

హొళగుంద, జూలై 31: హొళగుంద నుండి డణాపురం, సులువాయి మీదుగా ఆలూరుకి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు టీడీపీ మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, బీజేపీ నాయకుడు ప్రసాద్, జనసేన అశోక్ అన్నారు. త్వరలో పనులు చేపట్టనున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాకీర్, గాదిలింగ, అబ్దుల్ సుభాన్, రజాక్, సుభాన్, మంగయ్య పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, జూలై 31: మండలంలోని పాడి పశువులను పెంచి పోషించే యజమానులు, రైతులు మినీ గోకులాలకు దరఖాస్తులు చేసుకోవాలని పశువైద్యాధికారి కృష్ణనాయక్ కోరారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే వారు జాబ్ కార్డు, ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా పుస్తకం, స్థలం ధ్రువీకరణ పత్రం, గ్రామ సభ తీర్మానం, ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం వద్దు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 31: వేచ్చే నెల 8న జరిగే గ్రామాల్లో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అన్నారు. బుధవారం ఎస్టీయూ భవనంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ పాఠశాల కమిటీ ఎన్నికలు సామరస్యంగా జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తోడ్పడే వారిని చైర్మన్‌లుగా ఎన్నుకుంటే అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, అంజనేయ ఈశ్వరయ్య భాస్కర్ లక్ష్మణ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదు..

కోసిగి, జూలై 31: కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదు అని, వ్యాధి లక్షణాలు తెలియజేస్తే వైద్యం ద్వారా జబ్బు నయం అవుతుందని ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు అన్నారు. చింతకుంట, పల్లెపాడు, దొడ్డి, డి.బెళగల్ గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే చేశారు. కుష్టు వ్యాధి ఉన్న వారికి ప్రభుత్వం ఈ మందులను ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాముడు, సుశీలమ్మ, ఏఎన్ఎం అనిత, రేఖాశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, జూలై 31: స్థానిక మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం అభివృద్ధికి సహకరించాలని ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్ కోరారు. బుధవారం స్థానిక సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయంలో తుగ్గలి ఎంపీడీవో విజయలక్ష్మి దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ శాలువ కప్పి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

హంద్రీనీవాకు నీటిని వదలాలి

దేవనకొండ ,జూలై 31 : హంద్రీనీవా కాలువకు నీరు వదలాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల నాయకులు అశోక్, యూసుఫ్ బాషా అన్నారు. శ్రీశైలం డ్యాంలో నీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నా హంద్రీ నీవా కాలువకు మాత్రం నీళ్లు వదలకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. తక్షణమే హంద్రీ నీవా కాలువకు నీరువచ్చేలా అధికారుల చర్యలు తీసుకోవాలని అన్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 31 : వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి, పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ అన్నారు. వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ రాజీనామా చేసిన వారిని కూడా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్సీ జిల్లా కార్యదర్శి బి యేసుపు, ఐఎఫ్‌టీయూజిల్లా కార్యదర్శి కెయండి అనిఫ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి పూజలు చేసిన టీడీపీ నాయకులు


గంగపూజ చేస్తున్న నాయకులు

గోనెగండ్ల, జూలై 31: తుంగభద్ర కాలువ నీరు బుధవారం గోనెగండ్ల సెక్షన్‌ను చేరడంతో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు కులుమా ఉల్లిగడ్డల రాముడుతో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు ఎల్లెల్సీ నీటికి(గంగమ్మ)కు హారతులుఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, రాంపురం రఫీక్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తుగ్గలి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగరాజు

తుగ్గలి, జూలై 31: తుగ్గలి డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న నాగరాజును ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు ఇన్‌చార్జిగా తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అథ్లెటిక్ పోటీల్లో రజతం పతకం సాధించిన రాధమ్మ


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హెచ్ఎం రమణమూర్తి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 31: మండలంలోని పెద్దహరివానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని రాధమ్మ అథ్లెటిక్ పోటీలలో రజత పతకాన్ని సాధించింది బుధవారం విద్యార్థిని రాధమ్మను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి పీఈటీ రామన్న అభినందించి సర్టిఫికెట్, పతకాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అనంతపురం ఆర్‌డీటీ సంస్థ ఆలూరులో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని 200 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటిందన్నారు. తమ విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయిలోను రాణిస్తుండడం అభినందనీయమన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ బాలప్ప పాల్గొన్నారు.

రాజకీయాల కంటే.. ఆదోని అభివృద్ధి ముఖ్యం

● కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరు కావడంపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, జూలై 31: రాజకీయాల కంటే.. ఆదోని అభివృద్ధి ముఖ్యమని, మన ఊరు బాగుండాలంటే కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో ఎమ్మెల్యే పార్థసారథి ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణ అభివృద్ధికై 27 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిలర్ల అందరికీ పంపించడం జరిగిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో వీటన్నింటిని తీర్మానం చేసి, శాశ్వత పరిష్కారం ప్రజలకు చూపించే విధంగా పరిపాలన అందించాల్సి ఉందన్నారు. ఆదోని పట్టణానికి నీరు అందిస్తున్న బసాపురం ఎస్ఎస్ ట్యాంకు శాశ్వత పద్ధతిలో పునరనిర్మించడానికి రూ.37 కోట్లు 2023లోనే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు విడుదల అయ్యాయని గుర్తు చేశారు. ఆ నిధులను ఇంతవరకు సద్వినియోగం చేసుకోలేకపోయామన్నారు. ఎస్ఎస్ ట్యాంక్ పూర్తిస్థాయిలో ప్రాజెక్టు రిపోర్ట్ అందజేస్తే ఎస్ఎస్ ట్యాంక్ మరమ్మతులు శాశ్వతంగా ఉండే విధంగా చేసుకోవచ్చన్నారు. అమృత్ పథకం కింద నీటి పారుదల మెరుగు పరచుకోవడానికి, నీటి సల్బర్ మురుగు కాలవలు శుభ్రపరచుకోవడానికి రూ.129 కోట్లు సిద్ధంగా ఉందన్నారు. వీటన్నింటికీ కౌన్సిల్ అప్రూవల్ చేసి, డిజైన్ ఇస్తే పనులు వేయవంతంగా చేయొచ్చన్నారు. 42 వార్డులలో 41 వార్డులోనూ వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారని, కేవలం ఒకే ఒక్క స్థానాన్ని టీడీపీ దక్కించుకున్నారు. అలాంటప్పుడు వైసీపీ కౌన్సిలర్లు ఆదోని అభివృద్ధి సహకరించాల్సింది పోయి ఇలా కౌన్సిల్ సమావేశానికి డుమ్మా కొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కమిషనర్ రామచంద్ర రెడ్డి, టీపీవో శ్రీనివాసులు అన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసమైన రాష్ట్రం

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏపీ రాష్ట్రం విధ్వంసం అయిందని, కోలుకోవడానికి మరో 15 ఏళ్ల పాటు పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు మాజీ మంత్రి పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డి 5700 ఎకరాలు కంటే ఎక్కువ కుంభకోణం ఆదోనిలోనే మరింత ఎక్కువ జరిగిందని, త్వరలో బయటపెడతానని అన్నారు. రెవెన్యూ రికార్డులు కూడా తారుమారు చూసి సంపాదించారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఓ అధికారి వైసీపీకి తొత్తుగా మారి రికార్డులను సైతం తన గుప్పెట్లో ఉంచుకున్నారని అవన్నీ వెలికితీస్తానని అన్నారు. ఆదోనిని రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా

కోరం లేక ఆదోని మున్సిపల్ సమావేశం వాయిదా పడింది. బుధవారం ఉదయం 11 గంటలకు ఆదోని మున్సిపల్ కార్యాలయంలో జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42 మంది కౌన్సిలర్‌లు ఉండగా కేవలం 10 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో మున్సిపల్ చైర్మన్ శాంత, అధికారులు కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

● హాల్‌లో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
● గందరగోళంతో సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించిన చైర్మన్


వైసీపీ సభ్యులకు కౌంటర్ ఇస్తున్న టీడీపీ సభ్యులు


బయటకు వెళ్లిపోతున్న చైర్మన్ రఘు

ఎమ్మిగనూరు, జూలై 31: వైసీపీ, టీడీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య మున్సిపల్ సమావేశం తీవ్ర వాగ్వివాదాలతో రసాభాసగా మారింది. ఈ సమావేశం జరిగింది అరగంటసేపే అయినా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో గందరగోళం ఏర్పడి సమావేశం అర్ధాంతరంగా ముగింది. బుధవారం ఎమ్మిగనూరు పురపాలక సంఘం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభమై అజెండాలోని రెండు, మూడు అంశాలు చదవగానే మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ అజెండాలోని 18వ అంశం పెట్రోల్ బంకు ఏర్పాటును వాయిదా వేస్తున్నామని, మిగతా అంశాలన్నింటినీ ఆమోదిస్తున్నామని అన్నారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ నేడు కౌన్సిల్‌లో విచిత్రమైన పరిస్థితి ఏర్పడిందని, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి దయాదాక్షిణ్యాలతో కౌన్సిలర్లుగా గెలిచి నేడు పార్టీ మారి పచ్చకండువా వేసుకొని మురిసిపోతున్నారని అనడంతో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఎవరు ఎవరి దయాదాక్షిణ్యాలతో గెలవరని, అందరూ ప్రజల దయాదాక్షిణ్యాలతో గెలుస్తారని ఘాటుగా సమాధానం ఇచ్చారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీని మారిన వారు పదవికి రాజీనామా చేయాలని అనడంతో వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మీ పార్టీ నాయకురాలు కూడా పార్టీ మారారని, అది తెలుసుకోకుండా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. దీంతో సమావేశం అదుపు తప్పింది. వెంటనే చైర్‌పర్సన్ బెల్లుకొట్టి సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రాందాసుగౌడు మాట్లాడుతూ కౌన్సిల్‌లో ప్రజల సమస్యలపై మాట్లాడకుండా వారు పార్టీలు మారారు..వీరు పార్టీలు మారారని రాజకీయాలు మాట్లాడడం మున్సిపల్ వైస్ చైర్మన్‌కు తగదన్నారు. ఇటీవల పార్టీలో చేరిన కౌన్సిలర్లు ఇసాక్, చంద్రమోహన్‌రెడ్డి, అమాన్, రజిత, సుంకమ్మ మాట్లాడుతూ ఈ మూడేళ్ల కాలంలో తమ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయామని, కనీసం ఇప్పుడైనా వార్డులను అభివృద్ధి చేసుకునేందుకు పార్టీ మారామే తప్ప మేము ఎవరి ఒత్తిడి వల్ల పార్టీ మారలేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగేషప్ప, కాశింబేగ్, డిస్ కేశవరెడ్డి, బజారి, రాజారత్నం, వాహిద్‌లతో పాటు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నిందలు తగవు

● ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేరుస్తుంది
● ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, జూలై 31: టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు పని గట్టుకొని నిందలు వేయడం సరికాదని ఆలూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీను సీఎం చంద్రబాబు నెరవేరుస్తాడన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 8 నెలలకు అమ్మఒడి అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పకుండా ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి అమ్మఒడి ప్రభుత్వం అందిస్తుందన్నారు. గురువారం జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు విజయంవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ముద్దురంగ, నరసప్ప, ఆంజనేయులు, నెట్టప్ప నాగరాజు, సురేంద్ర, కొమ్ము రామాంజినేయులు, గ్యాల్యం రామాంజినేయులు, సోమశేఖర్ రమేష్, రాము యాదవ్, వెంకటేష్, గుండన్న, మసాల జగన్ పాల్గొన్నారు.

● చిప్పగిరి మండలం రాయదుర్గం గ్రామంలో అక్రమంగా ఆలూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో తవ్వకాలు చేసి నాన్ అయాకట్టుకు సాగు నీరు మళ్లించుకునే ప్రయత్నాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ హెచ్ఎల్‌సీ అధికారులకు సూచించారు.

అభివృద్ధికి అధికారులందరూ సహకరించాలి: ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

నందవరం, జూలై 31: అభివృద్ధి అధికారులందరు సహకరించాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవి కోరారు. బుధవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలమీట్ ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. లక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అధికారులు సహకరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు డ్రైనేజిలు పూడికతీయాలన్నారు. తాగునీటి ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. కార్యాక్రమంలో ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య, డీటీ వహాబ్, ఏపీయం వీరన్న, ఎఈలు జయన్న, వెంకట్రాముడు, నాగేంద్ర, మనికంఠ, ఏపీవో శ్రీనివాసులు. ఎంఈవో రామంజీనేయులు, ఏవో శ్రవంతి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించరా?


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, జూలై 31: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఎలా అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అధికారులను ప్రశ్నించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మద్దిలేటి శెట్టి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నరసింహులు, ఉరుకుంద, గుండుబాషా, నెట్టికంటయ్య, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

మండలానికి ఇద్దరు అధికారుల నియామకం

కౌతాళం, జూలై 31: మండల తహసీల్దార్‌గా మల్లికార్జున స్వామిని, మండల విద్యాధికారిగా అంజనేయులును జిల్లా అధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ వర్మ ప్యాపిలికి డిప్యూటేషన్‌పై వెళ్లగా మండల విద్యాధికారి-1 వరప్రసాద్ ఇటీవల పదవి విరమణ చేయడంతో అతని స్థానంలో ఎమ్మిగనూరు ఎంఈవో అంజనేయులను కౌతాళం మండలానికి బదిలీ చేశారు.

9న పార్లమెంటు మార్చ్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున

ఆదోని (అగ్రికల్చర్), జూలై 31: నీట్ పరీక్ష లీకేజీ నిరసిస్తూ ఆగస్టు 9న తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. బుధవారం పట్టణంలో ఏఐఎస్ఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ చేసి విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టిందన్నారు. అనంతరం ఆదోని డివిజన్ అధ్యక్షుడిగా అనిల్ కుమార్, కార్యదర్శిగా ఉదయ్, ఉపాధ్యక్షులుగా రయన్, యవ్వంతు, తిరుమలేష్, సహాయ కార్యదర్శులుగా నవీన్, నరేంద్ర, సాయి చరణ్ ఎన్నుకున్నారు.

కేజీబీవీలో సీట్లు పెంచాలి

ఆలూరు, జూలై 31: కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు సీట్లు కేటాయించాలని పీడీఎస్‌యూ తాలూకా అధ్యక్షులు దుర్గ ప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జూనియర్ కళాశాలాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసి పర్యవేక్షణ మరింతగా పెంచేందుకు ఎస్‌వోలు స్థానికంగా ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు మధు హనుమేష్, వెంకటేష్, స్వామి పాల్గొన్నారు.

ఉత్సవాలకు 5 రోజుల అనుమతులు ఇవ్వాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

పత్తికొండ టౌన్, జూలై 31: పత్తికొండలో ఐదు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు జరుపుకునేలా అధికారులు అనుమతులు ఇవ్వాలని వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు వీర్రాజు, విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షులు భీమిరెడ్డి, కార్యదర్శి హనుమంతరెడ్డి, డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సాయిబాబా దేవాలయ ఆవరణలో వినాయక ఉత్సవ కమిటి సమావేశం వీర్రాజు అధ్యక్షతన జరిగింది. అనంతరం ఆర్డీవో రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటి గౌరవాధ్యక్షులు రంజిత్‌కర్ణి, నాయకులు గోవర్దన్ నాయుడు, రామలింగయ్య, నరేష్, సుధాకృష్ణ, ఉపేంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ హెల్మెట్ ధరించాలి

ఆలూరు రూరల్, జూలై 31: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయిజోత్త మరావు, సీనియర్ న్యాయవాది ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం హెల్మెట్ ధరించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్ధప్ప, తిమ్మయ్య, టీడీపీ నాయకులు, వెంకటేశ్వరులు, దేవేంద్ర, వెంకటేష్, అయ్యళ్ళి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రికెట్ కిట్లను అందజేస్తున్న అమ్రేష్

మంత్రాలయం, జూలై 31: గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం కనబరిచి రాణించినప్పుడే మంచి గుర్తింపు సాధ్యమని నవాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ అన్నారు. బుధవారం మండలంలోని బూదూరు గ్రామంలో అండర్-18 విద్యార్థులకు ఉచితంగా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోజేష్, దాసు, ఆర్ఎంపీ రామలింగడు, వీఆర్ఏ విజయ్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు రవిబాబు, భీమన్న, అనోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసిరకం పనులపై విచారణ చేయాలి

ఆదోని టౌన్, జూలై 31: గత ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హయాంలో నిర్మించిన బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం పనులు నాసిరకంగా జరిగాయని, ఆ పనులపై వెంటనే విచారణ చేపట్టాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాసిరకంగా పనులు చేపట్టడంతో చెరువు సైడ్ కాంక్రీట్ వాల్స్‌కు పగుళ్ళు ఏర్పడ్డాయని, ఎమ్మెల్యే పార్థసారథి చెరువు నిర్మాణంపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

టైలర్ల సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న టైలర్లు

పత్తికొండ, జూలై 31: టైలర్ల సమస్యల సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్రటైలర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి వినతి పత్రం అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, తాలూకా అధ్యక్షుడు రంగన్న ఆధ్వర్యంలో సుమారు 50మంది టైలర్లు ఎమ్మెల్యేను కలిశారు. ప్రభుత్వం దృష్టికి టైలర్ల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుంకన్న, చుక్కప్ప, తిక్కస్వామి,రాజు,ముని, ఇస్మాయిల్, గోపాల్,గోవింద్, రామాంజి,కంబగిరి, మహబూబ్‌బాషా ఉన్నారు.

పతి ఎకరాకు సాగు నీరందిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ

క్రిష్ణగిరి, జులై 31: హంద్రీ నీవా కింద ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం ఆలంకొండ పంప్ హౌస్, 68 చెరువులకు హంద్రీ నీవా నీటిని పంపిణీ చేసే పులిచర్ల గ్రామ సమీపంలోని జల్మాన్ కొండ పంప్ హౌస్‌ను పరిశీలించారు. హంద్రీ నీవా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ 68 చెరువులకు హంద్రీ నీవా నీటిని నింపి రైతులకు సాగునీరందిస్తామన్నారు. అనంతరం ఎస్.హెచ్ ఎర్రగుడి గ్రామంలో అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకులు చాకలి సుంకన్నను,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలంకొండ నబి సాహెబ్,కటారుకొండ మద్రి శ్రీరాములు, మాదాపురం ప్రసాద్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ముగిసిన పందికోన రిజర్వాయర్ చేపల వేలాలు

పత్తికొండ,జూలై 31: పందికోన రిజర్వాయర్ చేపల వేలాలు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. మత్స్యశాఖ అధికారి చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేలాలలో ముగ్గురువ్యక్తులు రూ10వేలు ధరావత్తు చెల్లించగా 12గంటలకు వేలంపాటను ప్రారంభించారు. నందికొట్కూరుకు చెందిన విజయసాయి అనే వ్యక్తి రూ.3లక్షల 49వేలకు దక్కించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, జూలై 31: ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని కడిమెట్ల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధులు ఎలా వ్యాప్తిచెందుతాయన్న విషయాలను టీవీలో చూపుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎం వాగేష్, హెచ్‌వోడీ రంగారెడ్డి, ఫార్మసి కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు రాజశేఖర్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూలై 31: పట్టణంలోని గుడ్‌బేస్ పాఠశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, విద్యార్థి సంఘం, బీఎస్‌వైఎ సంఘాల నాయకులు నరసన్న, వెంకటేశ్వర్లు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ గుడ్‌బేస్ పాఠశాల యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకువేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తూ వేల రుపాయలు దండుకుంటున్నారన్నారు విద్యాశాఖ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి

పట్టణంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నేషనల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు డీటీ శ్రీదేవికి బుధవారం ఫిర్యాదు చేశారు. సంఘం నాయకులు శేఖర్‌నాయుడు మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకేషనల్ కళాశాలను ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తు అక్రమ అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, మంజు, పవన్, మహానంది పాల్గొన్నారు.

'తలారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

ఆదోని, జూలై 31: మండలంలోని ఓ సర్పంచ్‌పై అత్యాచారానికి యత్నించిన తలారి నరసింహులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆయన పరామర్శించారు. అనంతరం నాయకులు, బాధితురాలి బంధువులతో కలిసి ఆదోని తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి, ఎస్సై ఎర్రిస్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై.రామచంద్రుడు, మహబూబ్ బాషా, రంగారెడ్డి, సుధాకర్ లక్ష్మన్న, శివప్ప, కేశన్న, రాముడు పాల్గొన్నారు.

కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి.. కేసు నమోదు

మంత్రాలయం, జూలై 31: మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్‌లో రాయచూరు నుంచి ఆర్టీసీ బస్టాండుకు వెళ్తున్న రాయచూరు-1 డిపోకు చెందిన కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ తిమ్మప్పను మంత్రాలయం చెందిన బొలేరో వాహనం డ్రైవర్ ప్రేమ్ కుమార్ దాడి చేసినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. బుధవారం రాయచూరు నుంచి బస్టాండు వెళ్తున్న కర్నాటక బస్సు నాగలదిన్నె నుంచి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం అధికమించడంతో బొలేరో డ్రైవర్ బస్టాండుకు వెళ్లి కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ తిమ్మప్పను చొక్క పట్టిలాగి దాడి చేశాడు. తిమ్మప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలేరో డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, జూలై 31: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో కర్ణాటక నుంచి మద్యం తెస్తున్న కోసిగి గ్రామానికి చెందిన బోయ కురివి తిమ్మప్పను అరెస్టు చేసినట్లు మాధవరం ఏఎస్ఐ బందెనవాజ్ తెలిపారు. బుధవారం కర్ణాటక నుంచి ఒక బాక్సులోని 90 ఎంఎల్ 96 టెట్రా మద్యంను తెస్తుండగా. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. బోయ కురివి తిమ్మప్పపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఆలూరు: కర్ణాటక నుంచి మద్యాన్ని సరఫరా చేస్తున్న అక్బర్ వలి అనే వ్యక్తిని బుధవారం అరికేర గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు ఆలూరు సెబ్ ఇన్‌చార్జీ సీఐ మల్లిక తెలిపారు. ఆయన వద్ద నుంచి 288 ప్యాకెట్ల కర్ణాటక మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు 5 వరకు పొడిగింపు

వెల్దుర్తి, జూలై, 31 : జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ఆగస్టు 5వ తేదీ వరకు పార్టీ పొడగించినట్లు జనసేన నాయకులు బాబీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు తీసుకున్న వారికి రూ. 5లక్షల ప్రమాద బీమా లభిస్తుందన్నారు.

ఎస్ఎస్‌ట్యాంక్‌లకు ఎల్లెల్సీ నీరు

గోనెగండ్ల, జూలై 31: గోనెగండ్ల సెక్షన్‌కు ఎల్లెల్సీ నీరు బుధవారం చేరడంతో నీటిని గోనెగండ్ల, అలావాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గోనెగండ్ల సెక్షన్‌కు ఉదయం 110 క్యూసెక్కుల నీరు చేరడంతో ఎస్ఎస్‌ట్యాంక్‌లతో పాటు గోనెగండ్లలోని తువ్వకుండతో పాటు ఇతర కంటలకు కూడా నీటి విడుదల చేశారు. కార్యక్రమంలో లస్కర్ అర్జున్ సిబ్బంది పాల్గొన్నారు.